# దటీజ్ ఎంపీ వద్దిరాజు

- ఎంపీ చొరవతో తెరుచుకున్న రైల్వే గేటు



2

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్

బుధవారం 26 మార్చి 2025 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ

## రూ. 188 కోట్ల 31 లక్షలతో...

# ఖమ్మం నగర బడ్జెట్ ఆమోదం

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 60 డివిజన్ లలో పన్నుల రీ-అసెస్మెంట్ సర్వే నిర్వహణకు చర్యలు
- 60 డివిజన్లను ఐదు జోన్లుగా విభజించి పాలన సాగించేందుకు ప్రణాళికలు రూపకల్పన
- ప్లాస్టిక్ రహిత ఖమ్మం నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి
- ఖమ్మం నగరం కార్పోరేషన్ బడ్జెట్ ఆమోదం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

2025-26 ఆర్థిక సంవత్సరానికి 188 కోట్ల 31 లక్షల రూపాయలతో ఖమ్మం నగర బడ్జెట్ ఆమోదం పొందినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, నగర పాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ కు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయ, ఖర్చు వివరాలు, 2024-2025 సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశ ంలో సుదీర్ఘంగా చర్చించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఖమ్మం నగరపాలక సంస్థ కు 188 కోట్ల 31 లక్షల రూపాయలతో మిగతా 2లో..

# మిర్చి రైతులను కేంద్రం ఆదుకోవాలి

- సబ్సిడీ రుణాలు అందించి, నకిలీ విత్తనాల విక్రయాలను నియంత్రించాలి
- ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

5



# మానవత్వం చాటుకున్న.. బిలీఫ్ హాస్పిటల్ చైర్మన్ రమాజ్యోతి

- అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రూ. 20వేలు సాయం

3





5

# పలుగు, పార పట్టి... ఉపాధి పనిలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

## దటీజ్ ఎంపీ వద్దిరాజు

- ఎంపీ చొరవతో తెరుచుకున్న రైల్వే గేటు





**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

కొన్ని నెలలుగా మూసివేయబడిన ఖమ్మంలోని రైల్వే మధ్య గేట్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చొరవతో ఎట్టకేలకు తెరుచుకుంది. దీనిని మంగళవారం తెరవడంతో పాదాచారులు, వాహనాల రాకపోకలు తిరిగి మొదలయ్యాయి.దీంతో,గాంధీ చౌక్, కమాన్ బజార్ వ్యాపారస్తులు, స్థానికులు, ప్రయాణీకులు హర్షం ప్రకటించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ లో మూడో ప్లాట్ ఫాం విస్తరణ పనులు కొనసాగుతుండడంతో ఈ గేట్ ను మూసివేశారు. ఈ కారణంగా గత 4 నెలలుగా గాంధీ చౌక్, కమాన్ బజార్, వాటి పరిసరాలలో వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి.గేట్ మూసివేత వల్ల తమకు ఎదురవుతున్న కష్టాలు,నష్టాల గురించి వ్యాపారస్తులు, స్థానికులు ఎంపీ రవిచంద్రను కలిసి వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా దీని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం,రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేయడం తెలిసిందే. అలాగే, ఎంపీ రవిచంద్ర మధ్య గేట్ తొలగించినట్టయితే, అదే చోట బ్రిడ్జి లేదా అండర్ పాస్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల సాధ్యాసాధ్యలను పరిశీలించా ల్సిందిగా మంత్రిని కోరగా, ఆయన వెంటనే అధికారులకు తగు చర్యల కోసం ఆదేశాలిచ్చారు.బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మాణం పనులు మొదలయ్యే వరకు మూసివేయబడిన గేట్ ను తెరిపించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి పట్ల మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశానుసారం మంగళవారం గేట్ తెరవడంతో రాకపోకల పునరుద్ధరణ జరిగింది. దీంతో గాంధీ చౌక్, కమాన్ బజార్ పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, స్థానికులు, ప్రయాణీకులు తమ సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ వద్దిరాజుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జవహర్ నవోదయ లో సీటు సంపాదించిన మిట్టపల్లి విద్యార్థి



**తల్లాడ కెరటం న్యూస్:** తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన జీనుగు నాగరాజు – లావణ్య దంపతుల పెద్ద కుమారుడు జినుగు రశ్విన్ కు ఈరోజు ప్రకటించిన నవోదయ ఐదో తరగతి ప్రవేశాలలో సీటు రావడం జరిగింది ఇదే గ్రామంలో ఉన్న సెయింట్ ఆన్స్ విద్యాలయంలో నాలుగో తరగతి చదువుతూ నవోదయ ఐదో తరగతి ప్రవేశానికై కష్టపడి చదివి తల్లిదండ్రులు మరియు సెయింట్ ఆన్స్ విద్యాలయం సిస్టర్స్ సహకారంతో వారి ప్రోత్సాహంతో రశ్విన్ సీటు సంపాదించడం జరిగింది. నవోదయ విద్యాలయంలో సీటు సంపాదించిన జినుగు రశ్విన్ ను గ్రామస్తులు యువకులందరూ ప్రత్యేకంగా అభినందించారు.

# రూ. 188 కోట్ల 31 లక్షలతో...

# ఖమ్మం నగర బడ్జెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి..)

బడ్జెట్‌ను ఆమోదించడం జరిగింది. ఇంటి పన్ను ద్వారా 33 కోట్ల 92 లక్షలు, సర్ చార్జ్ స్టాంప్ డ్యూటీ ద్వారా 13 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా 55 కోట్ల 90 లక్షల ఆదాయం సమకూరుతుందని బడ్జెట్‌లో అంచనా వేయడం జరిగిందని అన్నారు.

రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపు, 10% గ్రీన్ బడ్జెట్ కలుపుకొని చార్జీ వ్యయం క్రింద 65 కోట్ల 5 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు. ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చు, సాధారణ పరిపాలన టౌన్ ప్లానింగ్ కు 14 కోట్ల 12 లక్షల రూపాయలు, క్యాపిటల్ ఖర్చు కు 23 కోట్ల 65 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు.

ప్రణాళికేతర నిధులు, ప్రణాళిక నిధులు, ఇతర గ్రాంట్స్ ద్వారా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో వచ్చే ఆర్థిక సంవత్సరం 78 కోట్ల 72 లక్షల క్యాపిటల్ ప్రాజెక్ట్స్ ఫండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రాథమిక లెక్కలపై లోతుగా చర్చ పెట్టడం జరిగిందని అన్నారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కార్పోరేషన్ పరిధిలో ఆస్తి పన్ను, ఇతర పన్నులు రీ– అసెస్మెంట్ చేసి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

కార్పోరేషన్ లో గతంలో ఎక్కడా లేని విధంగా వరదలు వచ్చిన సమయంలో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పని చేశారని కలెక్టర్ ప్రశంసించారు. వరదలు వచ్చిన ప్రాంతాల్లో ఆస్తి పన్ను సడలింపులో సైతం పాలనావర్గం మంచి నిర్ణయం తీసుకుందని కలెక్టర్ అభినందించారు.

ఎల్.ఆర్.ఎస్. ద్వారా కూడా కార్పోరేషన్ కు ఆదాయం వస్తుందని, వాటిని సైతం సరిగ్గా వినియోగించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. టౌన్ ప్లానింగ్, అద్దెల ద్వారా వచ్చే ఆదాయం, పన్నుల వసూలు మొదలగు ఆదాయ మార్గాలు పెంచుకోవడం, గతం కంటే 25 శాతం ఆదాయం పెరిగిందని కలెక్టర్ తెలిపారు.

కార్పొరేషన్ లో అధిక ప్రాధాన్యత ఎక్కడ ఉందో పాలక వర్గంలో చర్చ జరిపి ఆ పనులను మొదట చేపట్టాలని అన్నారు. డ్రైయినేజ్ ప్లాన్ పై దృష్టి పెట్టుకోవాలని అన్నారు. ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ అన్నారు.

పూణే నగరం వెళ్ళి అక్కడ జరుగుతున్న మంచి ప్రాక్టీసెస్ ఇక్కడ అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్బన్ కు ప్రత్యేకంగా ఇద్దరు తహసిల్దార్, ముగ్గురు సర్వేయర్లు ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, నెల రోజులలో ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తుందని అన్నారు. దూరదృష్టితో మాస్టర్ ప్లాన్ ను తయారు చేస్తున్నామని అన్నారు.

భూ గర్భ జలాలు పెంచుకునేందుకు నిర్మించే ప్రతి భవనంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్



రహిత ఖమ్మం జిల్లాగా రూపుదిద్దెందుకు ప్రణాళిక బద్దంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా గౌరవం అందించాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు లభిస్తాయని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తీగల వంతెన నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయడంలో భాగంగా స్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్సీల నిధులలో భాగంగా 4 కోట్లు కేటాయించాలని మంత్రి ప్రతిపాదనను అందరం ఆమోదించామని అన్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఖమ్మం పట్టణ రూపు రేఖలు మారిపోయాయని అన్నారు. వీధి దీపాలకు అంచనా మించి ఖర్చు కావడం జరిగిందని, దీనికి గల కారణాలు రివ్యూ చేసుకోవాలని అన్నారు. నగరంలో విపరీతమైన దోమలు ఉన్నాయని, దోమల నియంత్రణకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని అన్నారు. ప్రతి డివిజన్ లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం సంబంధిత ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా అందించాలని అన్నారు.

### విలీన పంచాయతీలపైనే దృష్టి..
### – పునుకొల్లు నీరజ, మేయర్

సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలీన పంచాయతీల అభివృద్ధిపైనే దృష్టిసారించాలని సూచించారని, మంత్రి ఆదేశాలతో. విలీన పంచాయతీలకే వార్డు బడ్జెట్ అధికంగా కేటాయించామని, ఆ నిధులను ఖర్చు చేస్తామని అన్నారు. రోడ్లపై రోడ్లు నిర్మించమని, డ్రైనేజీలపై డ్రైనేజీలు కట్టమని, రోడ్లు లేని చోట రోడ్లు వేస్తామని, డ్రైనేజీలు లేని చోట డ్రైనేజీలు నిర్మిస్తామని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెల మొదటి వారంలో మరోసారి కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఆ సమావేశంలో అందరి కార్పొరేటర్ల నుండి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. కార్పోరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ– అసెస్మెంట్ చేయడం ద్వారా 60 లక్షల వరకు ఆదాయం పెరిగిందని, రాబోయే ఆర్థిక సంవత్సరంలో 60 వార్డులలో రీ– అసెస్మెంట్ సర్వే నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. నగరంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా, రిజిస్ట్రేషన్ చేసుకునేలా సర్వే చేపడతామని అన్నారు. నగరంలో వాణిజ్య సంస్థలు కేవలం 7 వేలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయని, క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో మరోసారి సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. నగరంలో 60 డివిజన్లను 5 జోన్ లుగా (నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్) విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాబోయే కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ముందు ఈ ప్రణాళిక ఉంచుతామని అన్నారు. ప్రతి జోన్ లో రెవెన్యూ అధికారి, పారిశుధ్య ఇన్స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఈ టౌన్ ప్లానింగ్ ఉండేలా చూస్తామని, చిన్న చిన్న సమస్యలు జోనల్ స్థాయిలో పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

పారిశుధ్య నిర్వహణ కోసం 131 వాహనాలలో జిపిఎస్ ట్రాకర్, పారిశుధ్య ఇన్స్పెక్టర్లకు జిపిఎస్ వాకి టాకీలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా పారిశుధ్య నిర్వహణ మెరుగుపడిందని అన్నారు. భవిష్యత్తులో జవాన్లకు సైతం వాకి టాకీలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి డివిజన్ కు 2 అదనపు పారిశుధ్య కార్మికులను కేటాయించడం జరుగుతుందని అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు టర్మ్ భీమా అందించామని, రాబోయే సంవత్సరం హెల్త్ బీమా అందిరించేందుకు కృషి చేస్తామని అన్నారు. 19 నూతన ట్రాక్టర్లు, 30 ఆటోలు, 2 గడ్డి కోత యంత్రాలు , 2 డీ సిల్టింగ్ యంత్రాలు, 2 వాక్యూం యంత్రాలు కొనుగోలుకు టెండర్లు పిలిచామని అన్నారు. వారం రోజులలో రోడ్డు స్వీపింగ్ యంత్రం డెలివరీ అవుతుందని అన్నారు.

ప్రతి డివిజన్ పరిధిలో అవసరమైన నూతన రోడ్లు డ్రైయిన్ల, నీటి సరఫరా లైను, వీద్యుత్ లైన్ నిర్మాణం కోసం సమగ్ర సర్వే చేపడతామని అన్నారు. అక్రమాల నిర్మూలన కోసం డిసిఎం, డిఆర్ఎఫ్ లతో కలిసి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు.

నగర పాలక కార్పోరేటర్ కమర్తపు మురళీ మాట్లాడుతూ.. నగరంలో గ్రౌండ్ ఫ్లోర్ కు అనుమతి తీసుకొని అక్రమంగా మూడు నాలుగు ఫ్లోర్లు నిర్మిస్తున్నారని వీటికి కూడా ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. అద్దెల క్రింద మనకు వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉందని, దీనిని పెంచుకోవాలని అన్నారు. కమ్యూనిటీ హాల్స్ ను మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. ఖమ్మం నగరం మాస్టర్ ప్లాన్ కావాలని తెలిపారు. మాస్టర్ ప్లాన్ లేని కారణంగా 10 వేల ఇండ్ల వరకు అనుమతులు లేకుండా ఇంటి పన్ను వసూలు చేయలేక పోతున్నామని అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ కు తహసిల్దార్, సర్వేయర్ ఫుల్ టైం అందుబాటులో ఉండాలని అన్నారు. నీటి బిల్లు ప్రతి ఒక్కరు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న.. బిలీఫ్ హాస్పిటల్ చైర్మన్ రమాజ్యోతి

- **అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రూ. 20వేలు సాయం**

**వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి**

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న చిన్నారి యశ్వంతి ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ 20వేలు అందించి మానవత్వం చాటుకున్న ఖమ్మంలోని ప్రముఖ సంతాన సాఫల్య కేంద్రం బిలీవ్ హాస్పిటల్స్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ మహిళా









పారిశ్రామిక వేత్త అవార్డు గ్రహీత ఎం రమాజ్యోతి కి చిన్నారి కుటుంబ సభ్యులతోపాటు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని ఎం రమాజ్యోతి కోరారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం నగరంలోని ప్రముఖ వైద్యులు శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రిహాబ్ బుద్ధ సెంటర్ లో బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు భూపతిరావు, ఉషా దంపతుల కుమార్తె యశ్వంతి గత సంవత్సర కాలంగా ఆరోగ్య సమస్యతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంది అని బిజెపి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు గల్లా సత్యనారాయణ ద్వారా తెలుసుకున్న బిలీవ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ రమా జ్యోతి యశ్వంతి వైద్య ఖర్చులకు రూ. 20వేల రూపాయల నగదును అందించి, మెరుగైన వైద్య సేవలు అందించవలసిందిగా కోరడం జరిగింది. ఈ సందర్భంగా రమాజ్యోతి మాట్లాడుతూ... రావినూతల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నటువంటి యశ్వంతి సంవత్సర కాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై ఇప్పుడిప్పుడే కొద్దిగా ఆరోగ్యం కుదుటపడుతున్న టువంటి యశ్వంతి ఇంకా త్వరగా కోలుకోవాలని మరల యధావిధిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వీరితో పాటుగా బిజెపి ఖమ్మం మాజీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ద్వారా యశ్వంతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న రాజస్థాన్ కమ్యూనిటీ పెద్దలు బలవంత పురోహితు రూ.5000 రూపాయలను యశ్వంతి కుటుంబ సభ్యులకు అందజేసే యశ్వంతి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ... చేబ్రోలు భూపతిరావు ఉషా దంపతులు యశ్వంతి ఆరోగ్యం కోసం వారికి ఉన్నటువంటి రెండు ఎకరాల భూమిని, వారి జీవనోపాధికి ఉపయోగించే ట్రాక్టర్ మరియు టాటా ఏసీ వాహనాన్ని అమ్మి పాప ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టడం జరిగిందని, గతంలో పాప వైద్య ఖర్చులకు కేంద్ర మంత్రివర్యులు శ్రీ కిషన్ రెడ్డి గారి ద్వారా మరియు శ్రీ బండి సంజయ్ కుమార్ గారి ద్వారాను, మరియు తాంద్ర వినోద రావు గారి ద్వారా కొంత సహకారం అందించడం జరిగిందని, ఇప్పుడు పూర్తిగా వారి దగ్గర డబ్బులు లేవని ఎవరైనా దాతలు ఉంటే బుద్ధ రిహాబిటేషన్ సెంటర్ కు వెళ్లి డాక్టర్ జివి గారిని కలిసి ఆ కుటుంబ సభ్యులకు చేయూతన అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా నాయకులు శ్యామ్ రాథోడ్, చావా కిరణ్, బోయినపల్లి చంద్రశేఖర్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా నాయకులు ఆచంట కోటి, పిల్లలమర్రి వెంకట్, డి కొండ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠకులకు అవసరమైన వసతుల కల్పనకు కృషి

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
- **పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో పెట్టాలి**
- **జిల్లా గ్రంధాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

పాఠకులకు జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, టాయిలెట్స్, నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ ను పరిశీలించారు. ఆవరణ మొత్తం చదును చేయాలని అన్నారు. మొక్కలను పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి





పుస్తకాలు కావాలో వివరాలు అందిస్తే పది రోజుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు సంబంధించి ప్రతి సంవత్సరం అప్ డేట్ అయిన పుస్తకాలను ఉంచాలని, ఎప్పటికప్పుడు పాతవి మార్చాలని, పాఠకులు యువకులతో చర్చించి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు ప్రతి విభాగం వారీగా అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. గ్రంథాలయంలో ఈ– లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన కంప్యూటర్లు, హెడ్ సెట్ లను అందిస్తామని, ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లైబ్రరీలో పాఠకులందరికీ 15 రోజులలో ఐడి కార్డులు అందించాలని కలెక్టర్ సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించుకున్న తర్వాత ఇతరులకు సహాయం చేయాలనే దృక్పథం ఉండాలని కలెక్టర్ తెలిపారు. మరో నలుగురికి సహాయం చేసినప్పుడు వచ్చే సంతృప్తి అధికంగా ఉంటుందని అన్నారు. సమాజంలో మనం కోరుకునే మార్పు సాధనకు మనం కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ లైబ్రరీ పరిశీలన సందర్భంగా లైబ్రరీ కార్యదర్శి వి. అర్జున్, లైబ్రరీయన్ లు కె. రవిబాబు, బి. బాబు రావు, క్లర్క్ విజయ్ భాస్కర్, పాఠకులు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఆశా వర్కర్ల యూనియన్ సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

సోమవారం రోజు ప్రశాంతంగా హైదరాబాద్లో నిరసన ర్యాలీ చేస్తున్న ఆశా వర్కర్ల ను అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లో నిర్బంధించారు. పోలీసులు అరెస్టులు చేసే సందర్భంగా ఆశా వర్కర్ల కు కొంతమంది కి గాయాలు అయ్యాయి. పోలీసులు అక్రమ అరెస్టులకు ఖండిస్తూ ఖమ్మం జడ్పీ సెంటర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆశా వర్కర్స్ లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగటానికి వెళ్ళిన ఆశా వర్కర్లను రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు చేసి హైదరాబాద్లో ఆశా వర్కర్లు అని చూడకుండా కొట్టి అరెస్టు చేయాటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రశ్నించే వారిని చూస్తె బయపడుతున్నారు. పోలీసులతొ అరెస్టులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం ఆశా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని 18000 ఫిక్స్డ్ వేతనం అసెంబ్లీ సమావేశాలలో ప్రకటించాలని డిమాండ్. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ జిల్లా నాయకులు ఝాన్సీ రమ్య విజయ నిర్మల వెంకటరామమ్మ శశిరేఖ పద్మ విజయ తదితరులు పాల్గొన్నారు.

## నేటి పాలకుల చేతిలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

- **జనసేన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ మిరియాల రామకృష్ణ**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**




పాలకులు మారుతున్న, విద్యార్థుల భవిష్యత్తు మాత్రం మారట్లేదు. ఎందుకు విద్యా వ్యవస్థ పై ఇంతటి చిన్న చూపు. నేటి భావి, భారత పౌరుల భవిష్యత్త నిర్ణయించేది విద్యా వ్యవస్థ. అలాంటి వ్యవస్థను పేపర్ లీకేజీలతో నాశనం చేస్తూ వారి భవిష్యత్తు పై ఆటలాడుతూ వారి ఉజ్వల భవిష్యత్తును పాలకుల చేతులలో అస్తవ్యస్తం చేస్తున్నారు. నేడు తెలంగాణలో జరుగుతున్న ఎస్ ఎస్ ఎస్సి బోర్డు పరీక్ష విధానంలో పేపర్ లీకేజ్ తో స్పష్టంగా కనబడుతుందని అన్నారు . బహుశా పదో తరగతి విద్యార్థులకు ఓటు హక్కు లేకపోవడం ఇందుకు కారణమా, వారు ప్రశ్నించలేరని ధైర్యమా, గత పాలకులలో ఇలాంటి సంఘటన వల్లే వారికి ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో ఒకసారి గమనించగలరని పేర్కొన్నారు. రేపు అదే తీర్పు మీ ప్రభుత్వానికి కూడా రావచ్చు ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వం పై ఉంది. ఇలాంటి సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి, ఇందుకు కారకులైన వారిపై కేసు నమోదు చేసి, కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం అన్నారు.

## సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ






**ఖమ్మం రూరల్, కెరటం న్యూస్**

సోమవారం ప్రశాంతంగా హైదరాబాద్లో నిరసన ర్యాలీ చేస్తున్న ఆశా వర్కర్ల ను అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లో నిర్బంధించారు.పోలీసులు అరెస్టులు చేసె సందర్భంగా ఆశా వర్కర్ల కు కొంతమంది కి గాయాలు అయ్యాయి. పోలీసులు అక్రమ అరెస్టులకు నిరసన ఖమ్మం రూరల్ మండలం లో ఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జలగం నగర్ జాతీయ రహదారి నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆశా లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగటానికి వెళ్ళిన ఆశా వర్కర్లను రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు చేసి హైదరాబాద్లో ఆశా వర్కర్లు అని చూడకుండా కొట్టి అరెస్టు చేయాటాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రశ్నించే వారిని చూస్తె బయపడుతున్నారు. పోలీసులతొ అరెస్టులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం ఆశా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లీశ్వరి జ్యోతి సబ్ సెంటర్ల బాధ్యులు సుభద్ర నాగమణి పుష్ప రూపిణీ ఉమ లలిత నీలిమ అరుణ సుజాత పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీ అక్రమ అరెస్టులు ఖండించండి....సిఐటియు**

గ్రామ పంచాయితీ వర్కర్స్ ని అక్రమంగా అరెస్టు చేయటాన్ని అలాగే గ్రామదీపికలను విఓఎ లను తెల్లవారుజామున అరెస్టు చేయటాన్ని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు తీవ్రంగా ఖండించారు. ఖమ్మం రూరల్ పోలీసు స్టేషన్లో అరెస్టు అయిన పంచాయతీ వర్కర్స్ మరియు ఐకేపీ విఓఎ లనుపరమార్శించారు. అనంతరంవారిని స్టేషన్ నుండి విడిపించుకుని వెళ్ళారు.అరెస్టు అయిన వారిలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు జిల్లపల్లి రాములు వెంకన్న అనురాధ గోపయ్య రామకృష్ణ చరణ్ ధనమూర్తి ఐకేపీ విఓఎ మండల కార్యదర్శి జి వెంకట్రావమ్మ వున్నారు.

# సన్న, దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు.. వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు

- **ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్**

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**





యాసంగి మార్కెటింగ్ సీజన్ లో ఖమ్మం జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ఖమ్మం జిల్లాలో విజయవంతంగా జరిగిందని అభినందించారు. రైతు కోసం పనిచేస్తున్నామనే అంశాన్ని ప్రతి ఒక్కరు జ్ఞాపకం పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు పండించిన వరి పంట విస్తీర్ణం, పంట కోతల సమయం, కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు పంటలు తీసుకుని వస్తారనే అంశం వ్యవసాయ శాఖ ప్రణాళిక బద్ధంగా షెడ్యూల్ చేయాలని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం దాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు మొదలైన మౌళిక వసతులు ఉండేలా చూడాలని అన్నారు.వేయింగ్ యంత్రాలను, తేమ యంత్రాల పని తీరు  చెక్ చేసి సర్టిఫై చేయాలని అన్నారు.  త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకేట్లు పెట్టుకోవాలని అన్నారు.  వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్టిఫై చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలోనే తేమ యంత్రాలు అందుబాటులో పెట్టి, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ముందుగా రైతులకు బస్తాలు ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. కొనుగోలు సమయంలో మాత్రమే రైతులకు బస్తాలు ఇవ్వాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న బస్తాల వివరాలను ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో అప్ డేట్ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేసేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు నూతన సిమ్ కార్డులను అందించి డేటా ఎంట్రీ సత్వరం జరిగేలా చూడాలని అన్నారు. రైతులకు 48 గంటల వ్యవధిలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు. రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాళ్ళు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.  ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ఒకేసారి జరుగుతున్న నేపథ్యంలో రవాణా వాహనాలకు ఇబ్బందులు రాకుండా మందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.  సరిహద్దు ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం ధాన్యం రాకుండా చూడాలని అన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులందరికీ విజ్ఞప్తి పేరున రబీ వ్యవసాయ మార్కెటింగ్ సీజన్ కు సంబంధించిన కనీస మద్దతు ధరలు తెలిపే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఎ. అలీం, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, ప్రత్యేక అధికారులు, సెంటర్ ఇన్చార్జి లు ఐ.కె.పి., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాభివృద్ధికి బీఆర్ఎస్ పటిష్ఠ చర్యలు..

- **ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**
- **నాటి సీఎం కేసీఆర్, మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సారధ్యంలో అభివృద్ధి**

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**





మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ మాట్లాడుతూ... తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత గత పది సంవత్సరాలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో, మాజీ మున్సిపల్ మంత్రి కేటీఆర్ చొరవతో ఖమ్మం శరవేగంతో అభివృద్ధి జరిగిందన్నారు. జరిగిన అభివృద్ధి కుంటు పడకుండా ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత ఈనాటి ప్రభుత్వం పై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కి నిధులు సాధించడం కోసం జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది నగర కార్పొరేటర్స్ తో సమన్వయం చేసుకొని పని చేయాలి.  ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన కార్పొరేటర్స్ తెలవకుండా అధికారులు డివిజన్లో కార్యక్రమాలు నిర్వహించడం పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారులు నగర కార్పొరేటర్లు మాత్రమే. అధికారులు కార్పొరేటర్ల కు సమాచారం ఇస్తూ వారి నాయకత్వంలో పనిచేయాలన్నారు. నగరాన్ని జోనల్ వ్యవస్థగా ఏర్పాటు చేసే ఆలోచనలు పకడ్బందీగా నిర్వహించాలి.  వ్యవస్థ ద్వారా మెరుగైన పాలన మరియు ఆదాయం పెంపొందించుకోవడం కోసం పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సూచించారు. ఈ సమావేశం లో  మున్సిపల్ చైర్మన్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజామిల్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్ అన్ని డివిజన్ల కార్పొరేటర్ లు పాల్గొన్నారు.

# 16 మందిని అవుట్సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించండి

- **కార్పోరేషన్ సమావేశంలో బిజి క్లైమెంట్**
- **జనరల్ కౌన్సిల్ ఎజెండాలో పెడతాం**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**



పదేళ్లుగా ఖమ్మం కార్పోరేషన్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వాటర్ సప్లయ్ వర్కర్లుగా పనిచేస్తున్న 16 మంది కెఎంసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కెఎంసి సమావేశంలో సిపిఐ కార్పొరేటర్ బిజి క్లైమెంట్ డిమాండ్ చేశారు. కెఎంసి బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. బడ్జెట్ సమావేశం సందర్భంగా క్లైమెంట్ మాట్లాడుతూ పదేళ్లుగా పనిచేస్తున్న వీరు ప్రస్తుతం ఏ శాఖలో ఎవరి క్రింద పనిచేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో కాంట్రాక్టర్ వీరికి వేతనాలు చెల్లించినప్పటికీ రెండేళ్లుగా ఎవరు వీరి బాధ్యతను తీసుకోలేదన్నారు. దానవాయిగూడెం పార్కుతో పాటు వేర్వేరు డివిజన్లలో పంపు ఆపరేటర్లు లీకేజీ వర్కర్లుగా, ఫిల్టర్ బెడ్ ఆపరేటర్లుగా, ల్యాబ్ అసిస్టెంట్లుగా స్వీపర్లుగా వీరి విధులు నిర్వర్తిస్తున్నార న్నారు. గతేడాది కార్పోరేషన్ సమావేశంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని తాను తీర్మానం కోసం పట్టుబట్టగా అవుట్సోర్సింగ్ ఉద్యోగు లుగా గుర్తిస్తామని మేయర్ తో పాటు కమిషనర్ హామీ ఇచ్చారని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఎందుకు అవుట్సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించలేదని క్లైమెంట్ ప్రశ్నించారు. సకాలంలో వేతనాలు రాక పోయినప్పటి కీ వీరు ఇబ్బందులకు గురైనా విధులు నిర్వహిస్తున్నా రని క్లైమెంట్ తెలిపారు. క్లైమెంట్ ప్రశ్నకు కమిషనర్ సమాధానమిస్తూ వచ్చే నెల ఐదున జరిగే జనరల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్తో పాటు మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారని క్లైమెంట్ తెలిపారు.

# మిర్చి రైతులను కేంద్రం ఆదుకోవాలి

- సబ్సిడీ రుణాలు అందించి, నకిలీ విత్తనాల విక్రయాలను నియంత్రించాలి
- ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**ఢిల్లీ బ్యూరో, కెరటం న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మిరప పంట అత్యధికంగా సాగవుతోందని.. అయితే రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. ఈ మేరకు 377 నిబంధన కింద మిర్చి రైతుల పక్షాన పలు అంశాలను ప్రస్తావించారు. ఆ వివరాలు ఇలా.... దేశంలో మిర్చి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రభాగంలో ఉంది. గతేడాది 12.43 లక్షల హెక్టార్లలో మిర్చి సాగు చేయగా 48.29 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఖమ్మం, వరంగల్ మరియు మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా సాగవుతోంది. తెల్లదోమ, విల్ట్ మరియు ఆకు ముడత వంటి తెగుళ్లతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం అధిక ఖర్చులతో ఆర్థికంగా దెబ్బతింటున్నారు.



మార్కెట్ హెచ్చుతగ్గులు, మధ్యవర్తుల దోపిడీతో నష్ట పోతున్నారు. వర్షాభావం, సరైన నీటిపారుదల సదుపాయం లేక, కల్తీ విత్తనాలు, కార్మికుల కొరత, అధిక వ్యయంతో రైతులపై ప్రభావం పడి.. అప్పుల పాలవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి..చీడపీడల నియంత్రణ చర్యలు చేపట్టి, సబ్సిడీలు అందించడం, మద్దతు ధర కల్పించడం, నిల్వ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించడం.. వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

## విద్యతో పాటు వృత్తి విద్యలు నేర్వాలి

- ప్రిన్సిపాల్ టి. జీవన్ కుమార్






**మానుకోట టౌన్, కెరటం న్యూస్**

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కై వృత్తి విద్యలలో నైపుణ్యం సాధించాలని మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.జీవన్ కుమార్ విద్యార్థులను కోరారు. మంగళవారం నాడు కళాశాలలో టైలరింగ్ లో సర్టిఫికెట్ కోర్సును ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ ప్రారంభించారు. కళాశాలలో టైలరింగ్‌లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించడానికి అవసరమైన కుట్టుమిషన్ ను పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చడం హర్షణీయమని, ట్రస్ట్ నిర్వాహకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పరిశపుల్లయ్య సేవలు అభినందనీయమని ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ అన్నారు. టైలరింగ్ అనేది ఎల్లవేళలా డిమాండ్ ఉన్న కోర్స్ అని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఇందిర కోరారు.ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు కావాల్సిన చేయూత ట్రస్ట్ చేస్తున్నట్లు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిశపుల్లయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సభ్యులు వరలక్ష్మి, మేఘమాల, కుట్టు శిక్షణ రీసోర్స్పర్సన్ భాగ్యశ్రీ, ఎన్. ఎస్. ఎస్. కోఆర్డినేటర్ జి. వెంకయ్య, కోర్సు కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రమణ, సేట్ రాం, సురేందర్ రెడ్డి, వెంకన్న, లక్ష్మా, రవి, యాకూబ్, నర్సయ్య, రమ, కొమరయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలుగు, పార పట్టి... ఉపాధి పనిలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

టేకులపల్లి మండలం లో జరుగుతున్న పలు ఉపాధి హామీ కూలి పనులను స్వయంగా వెళ్ళి పరిశీలించిన కలెక్టర్.. కూలీలతో కలిసి పలుగు పార పట్టి కాసేపు మట్టి తవ్వి పోశారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ నందు జరుగుచున్న రైతు సమ్మయ్య ఫారం పాండు పనిని పరిశీలించి కూలీలతో పాటు సరదాగా సుమారు 45 నిమిషాలు పనిచేసినారు. మరియు పక్కనే జరుగుతున్న రహదారి నిర్మాణం పనిని పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు మరియు ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలని, ప్రతిరోజు ప్రతి కూలి 300 రూపాయలు కొలతల ప్రకారం పని చేసుకోవాలని ఎక్కువ గంటలు పని చేయాలని, మరియు ఎండాకాలం దృష్ట్యా ఉదయాన్నే ఉపాధి పనులకు హాజరయ్యి పని చేసుకోవాలని



కూలీలకు తెలియజేశారు. రైతులు రాబోయే రోజులలో నీటి ఎద్దడి దృష్ట్యా అందరూ ఫారం పా%శీ%డు నిర్మాణాలను పెద్ద ఎత్తున నిర్మించుకోవాలని, మరియు ఎక్కువ ఆదాయం వచ్చే మునగ పంటల సాగును చేపట్టాలని రైతులకు తెలియజేశారు. మరియు ముగ్గురు రైతులు యాదగిరి, రవి మరియు శ్రీను లు సాగు చేస్తున్న 6 ఎకరాల మునగ తోట సాగును పరిశీలించి రైతులతో మాట్లాడినారు. మరియు సంతృప్తి వ్యక్తం చేసినారు. అనంతరం ఎర్రాయి గూడెం గ్రామపంచాయతీ నందు ఉపాధి హామీ



పథకంలో నూతనంగా నిర్మించిన రెండు పశువుల షెడ్లను గూగులత్ శాంతి మరియు బీష్మ షేడ్ లను పరిశీలించి వీటిని పశువుల కొరకు సద్వినియోగం చేసుకోవాలని రైతులను ఆదేశించినారు.రైతులకు, అధికారులకు పలు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన , ఎంపీడీవో జి. రవీందర్, ఎంపీఓ గాంధీ మరియు ఏవో అన్నపూర్ణ, ఏపీవో శ్రీనివాస్ ఈసీ తిరుపతయ్య టిఏ ఈశ్వరి ఎఫ్ఏ లు కార్యదర్శిలు మరియు ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రతిజ్ఞ

- ఆరు హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు
- పాలకుల వైఫల్యంపై భాజపా గట్టి పోరు
- రైతుల న్యాయమైన సమస్యలకు మా మద్దతు
- ప్రజల విశ్వాసమే భాజపా బలమైన ఆయుధం
- మీడియా చిట్‌చాట్‌లో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ప్రజా సంక్షేమాన్ని తన ప్రధాన లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతుందని జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ, ప్రభుత్వ విధానాలను ప్రజల సమక్షంలో లోతుగా విశ్లేషించారు. జిల్లా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ, పాలకులు వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మేలు చేయడమే తమ ధ్యేయంగా, భాజపా గడపగడపకు వెళ్లి వారి సమస్యలను వినిపిస్తుందని అన్నారు.



**ప్రజా సమస్యలే మా ప్రధాన ఏజెండా**

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై సరైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. "ప్రతి ప్రభుత్వమూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత వహించాలి. అవి అమలు కాకపోతే, ప్రజా హక్కుల కోసం నిరంతరం పోరాడతాం" అని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని భాజపా పార్టీ గడపగడపకు వెళ్లి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలియజేశారు.

**ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాటం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదని భాజపా నేతలు విమర్శిస్తున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం కేవలం కొంతమందికే ఆ మాఫీని వర్తింపజేసిందని తెలిపారు. మొత్తం మూడు లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా, కేవలం రెండు లక్షల మందికే మాఫీ చేయడం రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా భాజపా పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు.

**పాలకుల నిర్లక్ష్యంపై విమర్శలు**

జిల్లాలో ప్రజా సమస్యలు పక్కనపెట్టి, ముగ్గురు మంత్రులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా, రాజకీయ కలహాలలో కాలక్షేపం చేస్తున్నారని నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య పరస్పర ఆరోపణలు పెరిగిపోతున్నాయని, కానీ వీటి వల్ల ప్రజలకు ఎలాంటి మేలుకలుగలేదని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కానీ పాలకులు ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టారని ఆరోపించారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే భాజపా లక్ష్యం**

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు భాజపా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకుంటుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో భాజపా ప్రజలతో మమేకమై, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తామని, భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ముమ్మరం చేస్తామని కోటేశ్వరరావు తెలిపారు.